క్లుప్తంగా

రైతులకు అవగాహన



పలగరలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: రైతులకు ఎరువుల వినియోగం, శత్రు, మిత్ర పురుగుల వలన ప్రయోజనాలు వంటి అంశాలు పొలంబడి కార్యక్రమం ద్వారా అవగాహన కలుగుతుందని ఏఓ శ్రావణ్ తెలిపారు. పలగరలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ముందుగా ప్రీ బాలట్ పరీక్ష నిర్వహించారు. ఎరువుల వినియోగం ఏ విధంగా చేయాలి, శత్రు, మిత్ర పురుగుల ట్రాప్ క్రాప్స్ గురించి ప్రశ్నించడం వంటి అంశాలతో వారిలో అవగాహన పెంచడం జరిగింది. రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. రైతులు మంచి విత్తనాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు దినకర్, నారాయణరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ ఎస్‌ఐలుగా దినకర్, పి.నారాయణరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వీరికి ముందు పట్టణ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఫకృద్దీన్ బదిలీపై పాచిపెంట వెళ్లారు. ఆయన స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు కార్యాలయంలో డీసీబీ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన దినకర్, కొమరాడ పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన పి.నారాయణరావులను పార్వతీపురం పట్టణ ఎస్‌ఐలుగా బదిలీ చేయడంతో వారు బాధ్యతలు చేపట్టారు.

బీమా పరిహారం అందజేత



బీమా సాయాన్ని అందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: పట్టణంలోని 26వ వార్డు దండిగాం రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న రాము అకస్మాత్తుగా మరణించిన నేపథ్యంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్‌బీమా కింద తక్షణ సాయంగా రూ. పది వేలు బుధవారం అందజేశారు. స్థానిక కౌన్సిలర్ పాండ్రంకి సన్యాసమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, తదితరుల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి అప్పలస్వామి, బవిరెడ్డి సత్యప్రసాద్, బీసపు బాలకృష్ణ, మేకల శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పి. కోనవలసలో పారిశుధ్య పనులు



ఎ.కోనవలసలో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ మంగమ్మ

సాలూరు: పాచిపెంట మండలంలోని పి.కోనవలసలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సర్పంచ్ మంగమ్మ ఆధ్వర్యంలో బుధవారం కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. వర్షాల సీజన్ కాబట్టి అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ మంగమ్మ తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



యర్రయ్యకు పింఛన్ అందిస్తున్న సంధ్యారాణి

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామానికి చెందిన వన్నలి యర్రయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ లబ్ధిదారుడు కావడంతో వలంటీర్ జి.సంధ్యారాణి బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఈ నెల పింఛన్ మొత్తాన్ని అందజేసింది. అంత దూరం వెళ్లి పింఛన్ అందించిన సంధ్యారాణిని గ్రామస్తులు అభినందించారు.

అర్హులందరికీ ప్రభుత్వ సేవలు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్:

అర్హులందరికీ ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని ఎమ్మెల్యే జోగారావు అధికారులను ఆదేశించారు. పురపాలక సంఘం పరిధిలో గల మేదర వీధి - 1, మేదరవీధి - 2, గాంధీనగర్ సచివాలయంలో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాలలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే 3 సచివాలయాలు పరిధిలో జగనన్న సురక్ష క్యాంపు ద్వారా జారీ చేసిన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు, పార్టీ పట్టణ అధ్యక్షులు, ఫ్లోర్ లీడర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

లచ్చయ్యపేటలో..

సీతానగరం: జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్షతో ప్రజలకు విస్తృత సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ ఎం.బాబ్జి అన్నారు. లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ అధ్యక్షతన బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం, పంచాయతీ కార్యదర్శి మురళీ, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సీతానగరం: మాట్లాడుతున్న వక్తలు

ఇష్టపడి విధులు నిర్వహించాలి

● డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మక్కువ: వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కష్టపడి కాకుండా... ఇష్టపడి విధులు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. బుధవారం స్థానిక పద్మశ్రీ థియేటర్ వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, సమన్వయకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి, ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, సమన్వయకర్తలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలపై ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. గతంలో పింఛన్లు, ఇళ్లు, నీరు, రోడ్లు కావాలంటే నాయకుల వద్దకు ప్రజలు వెళ్లేవారని.. కాని ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో అధికారులు, నాయకులు ప్రజల వద్దకు వచ్చి వారికి ఏమి కావాలో తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంటింటా నీరందిస్తారని చంద్రబాబునాయుడు చెబుతున్నారని, మరి 14 ఏళ్లలో ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. గతంలో డ్వాక్రా పొదుపు సంఘాలకు రూ.14 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి 14 పైసలు కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సుమారు ఆరు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు 53 లక్షల మంది రైతుభరోసా, లక్షలాది మంది తల్లులకు అమ్మఒడి లాంటి పథకాలు అమలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావూరి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావూరి గంగునాయుడు, ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దాలినాయుడు , సంజీవనాయుడు, సూర్యనారాయణ, శ్రీరాములనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ విగ్రహావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఈ నెల 8వ తేదీన ఆవిష్కరించనున్నట్టు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. పురపాలక సంఘం 20, 21 వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి కార్యక్రమాలపై సమీక్షించారు.

కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్ వై.త్రినాధ, సీనియర్ నాయకులు రెడ్డి రవికుమార్, పల్లె భానుప్రకాష్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు భవన నిర్మాణ కార్మికుల వినతి

పార్వతీపురం టౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు శనపతి రామకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే జోగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ క్లెయిమ్‌లు నష్ట పరిహారం తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. 2019వ సంవత్సరం పెండ్లికానుక, సహజ మరణములు, ప్రసూతి పరిహారం వెంటనే చెల్లించేలా చూడాలని కోరారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరికీ వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్ అమలు చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టి.రమేష్, వై.వాసు, బి.శ్రీను, జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రోడ్డుకిరువైపులా ప్లాంటేషన్

సీతానగరం: మండలంలోని ఉపాధి హామీ పథకం నిధులతో తయారుచేస్తున్న అంటిపేట నర్సరీలో ఉత్పత్తి అయిన మొక్కలను రోడ్డుకు ఇరువైపులా నాటడానికి సిద్ధం చేస్తున్నామని ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అటవీ, ఉపాధి హామీ పథకం ద్వారా అంటిపేట వద్ద ఉన్న నర్సరీలో ఉన్న మొక్కలను మండలంలోని నూతనంగా వేస్తున్న రోడ్డుపై రెండు కిలోమీటర్ల పొడవునా మొక్కలు వేయాలని సూచించినట్లు తెలిపారు. నర్సరీ నిర్వాహకులు ప్లాంటేషన్ చేయడానికి మొక్కలను సిద్ధం చేయాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులు తమ సొంత పొలాల్లో ఫలసాయాన్నిచ్చే వివిధ రకాలకు చెందిన మొక్కలను గట్లపై నాటడానికి, రోడ్లపై ప్రయాణికులకు నీడనిచ్చే మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకరరావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణపై పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రభుత్వ పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్, ఎలక్ట్రికల్‌కు సంబంధించి అగ్ని ప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి.. వాటిని ఎలా నివారించాలన్న వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పెంటయ్య, ఎల్ఎఫ్‌పీ సీతారాం, సురేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

జియ్యమ్మవలస: మండలంలోని పీటీమండ పంచాయతీ పల్లపుసిరిపి గ్రామానికి రూ.57 లక్షలతో, నడిమిసిరిపి గ్రామానికి రూ.64లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, గిరిజనులంతా ఆయనకు రుణపడి ఉంటామని అన్నారు. మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, జెడ్పీటీసీ శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, నాయకులు బలగ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



పల్లపుసిరిపిలో బీటీరోడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పది ద్విచక్ర వాహనాలు వేలం

సాలూరు: రూరల్ స్టేషన్ పరిధిలో వివిధ సారా కేసుల్లో సీజ్ చేసిన వాహనాల్లో పది వాహనాలను వేలం వేసినట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ, సారా కేసుల్లో పట్టుబడిన 13 వాహనాలను వేలంపాటలో ప్రదర్శించగా.. 1,63,900 రూపాయలకు పది వాహనాలు విక్రయమయ్యాయన్నారు. వివిధ సారా కేసుల్లో పట్టుకున్న సుమారు 1446 లీటర్ల సారాను కొట్టక్కి బ్రిడ్జి సమీపంలో ధ్వంసం చేశామని తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్ సమక్షంలో ఈ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

రేగాలమ్మకు మొక్కుల చెల్లింపు



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరులో రేగాలమ్మ గ్రామదేవతకు గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని అమ్మవారి గుడి ప్రాంగణంలో బుధవారం వివిధ రకాల పుష్పాలు, నైవేద్యం, చీరలతో అత్యంత వైభవంగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా ఖరీఫ్ ప్రారంభానికి ముందు ఎలాంటి కష్టాలు రాకుండా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు.

బదిలీపై వెళ్లిన సర్వేయర్లకు సన్మానం



సర్వేయర్లను సన్మానిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

పాలకొండ: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసి బదిలీపై వెళ్లిన సర్వేయర్లను బుధవారం సన్మానించారు. కొండాపురం గ్రామ సర్వేయర్ ఎల్.వెంకటరమణ, సింగన్నవలస గ్రామ సర్వేయర్ ఎస్.సాగర్, అంపిలి గ్రామ సర్వేయర్ ఎస్.వెంకటేష్‌లను తహసీలాకదర్ పి.సోమేశ్వరరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, ఉప తహసీల్దార్ బుచ్చయ్య ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఐ పుష్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తలవరంలో 'జగనన్న సురక్ష'

వీరఘట్టం: మండలంలోని తలవరం, హుస్సేనుపురం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు సచివాలయాల పరిధిలో వచ్చే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.

నేడు వీరఘట్టంలో అమ్మఒడి సంబరాలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో గురువారం అమ్మఒడి సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. బాలుర, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: మండలంలోని పెదరామ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీపీఎం ధనుంజయరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక, ఆరోగ్యకరమైన పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం కషాయాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ఏఓ మన్మథరావు, ఎస్ఎఫ్ఏ తిరుపతి, కృష్ణవెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంఈఓలు జి.సూరి దేముడు, ఎం.వెంకటరమణ కోరారు. మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని అన్ని మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమికోన్నత, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో విద్యాపరమైన అంశాలపై, విద్యేతరపరమైన అంశాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. జిల్లా స్థాయిల్లో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు త్వరలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు అవగాహన కల్పించుకోవాలని అన్నారు. అలాగే అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న ఉపాధ్యాయులు అమ్మ ఒడి పథకం అమలయ్యేలా ఇప్పటి నుండే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ

చేతి రాత చక్కగా ఉండాలి

బలిజిపేట: పాఠశాల విద్యార్థుల చేతిరాత చక్కగా ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ సింహాచలం తెలిపారు. పలగర, గుడివాడ కాలనీలలో ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల చేత రాయించి వారి చేతిరాతను గమనించి వారికి మెలకువలు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చేతిరాత చక్కగా ఉండే విధంగా చూడాలని సూచించారు. ఆంగ్ల పాఠాన్ని చదివించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ద్వారా వారిని ముందుకు తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు చదవడం, రాయడం బాగా నేర్పించడం వలన ముందు తరగతులలో వారికి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ శ్రీరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పలగరలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ సింహాచలం

వైఎస్సార్‌సీపీలో చేరిన జన సైనికులు



వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న జన సైనికులు

పార్వతీపురం టౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న సుపరిపాలనపై ఆకర్షితులైన జన సైనికులు పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు అంతా కలిసి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావుని క్యాంపు కార్యాలయంలో కలిసి పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అందరూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పోల ఈశ్వరనారాయణ, గాజాపు శ్రీనివాసరావు, బర్ల సింహాచలం, బర్ల వెంకటరమణ, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

గరుగుబిల్లి: విద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులను ప్రభుత్వం తీసుకొచ్చిందని రావుపల్లి పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు అన్నారు. మండలంలోని రావుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నాలుగో విడత అమ్మఒడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతిదీవెన, అమ్మఒడి వంటి కార్యక్రమాలను అమలుచేసి పేదవిద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎంఈఓ ఎస్.నాగభూషణరావు మాట్లాడుతూ ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏటా రూ.15వేలు జమచేస్తోందన్నారు. నాలుగో విడతగా మండలంలో సుమారు 5వేల మంది తల్లుల ఖాతాల్లో నగదును జమ చేయడం జరిగిందన్నారు. రూ.15 వేలులో రూ.1,000లు టాయిలెట్ మెయింటెనెన్స్‌కు, రూ.1,000లు స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌కు జమచేసి మిగిలిన రూ.13వేలు తల్లుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.